
# ఫ్లాష్ బ్యాక్



**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

## రోజారమణి

## (సినిమా రంగం నుంచీ పునర్ముద్రణ)

“భక్త ప్రహ్లాద"లో బాలతారగా ప్రారంభించిన నా నట జీవితం మరో మధురమైన మజిలీ చేరుకుంది. అదే "ఓ సీత కథ". ప్రహ్లాదుడి పాత్ర ధరించేనాటికి నా వయసు 5. ఊహే సరిగా రాని పసి వయసులో నటించాను. ఆ నాటి సంఘటనల గురించి మా అమ్మ చెబుతూంటే మనస్సు గగుర్పొడుస్తుంది.






"ప్రహ్లాద" షూటింగ్ జరుగుతూండగా ఓ రోజున ఒక నల్ల త్రాచును నా మెడలో వేసుకోమన్నారు. ఏ జంకూ లేకుండా ఆ మిన్నాగును మెడలో వేసుకున్నాను. అది నా మెడ చుట్టూ చుట్టుకుని తలమీద పడగెత్తింది. దూరంగా కూచుని ఉన్న మా అమ్మ యధాలాపంగా షూటింగ్ దగ్గరకొచ్చారు. నా మెడలో ఆ నల్ల త్రాచును చూడగానే ఆమె గుండె ఝుల్లుమనిపోయి, కోపంతో ఆవేశంతో దుఃఖంతో ఊగిపోతూ, "నా బిడ్డ మెడలో పామును వేస్తారా? అది జడుసుకు చచ్చిపోతేనో? వద్దు. మీ షూటింగ్ వద్దు" అని కేకలేస్తూంటే అక్కడున్న పెద్దలు "అమ్మా, అమ్మాయి

తనంతట తానే ఆ త్రాచును మెడలో వేసుకుందమ్మా. భయంలేదు. పాపకు నిజంగానే ప్రహ్లాదుడే పూనాడమ్మా. లేకపోతే అంత ధైర్యం, భక్తి భావనా ఎక్కడ్నుంచొస్తాయి?" అని చెప్పి సమాధాన పరిచేసరికి చాలా కష్టమైపోయిందట. చిన్న పిల్ల – అదే మెళ్ళో పామును వేసుకుంది. నేను చూస్తూ ఊరుకోవలసి వచ్చింది కదా అనే దిగులుతో మా అమ్మ కూడా ఏమయితే అయిదని అక్కడ బుట్టలో ఉన్న ఓ పామును మెడలో వేసుకుందట. బరువుగా, మెత్తగా తడిగా పాము ఒంటిమీద పాకుతూంటే ఒళ్ళు ఝల్లుమని పోతూండగా అలాగే వంటి బిగువున షూటింగ్ అయ్యేవరకు ఉండిపోయిందట.

మరొకటి "ప్రహ్లాద"లోనే ఏనుగులతో తొక్కించే సన్నివేశం ఒకటుంది. ఏనుగులు పరుగున వస్తూంటే ఆ గుంపు మీదికి నన్ను విసిరేస్తారు. నా మీద అడుగు వెయ్యబోయిన ఏనుగు ఎత్తిన కాలు దించకుండా నిలబడి తర్వాత కాలు వెనక్కు తీసేసుకుంటుంది. ఆ షాట్ తీస్తున్నప్పుడు మా నాన్న అలాగే స్పృహ తప్పి పడిపోయారట. షాట్ అయిపోయింది. కానీ ఆయనకు స్పృహ రావడానికి మరో రెండు గంటలు పట్టింది.

ఇటువంటి గండాలన్నీ (గండాలని ఎందుకంటున్నానంటే ఇటువంటి సన్నివేశాలు చిత్రీకరించేటప్పుడు ఎవరివల్ల చిన్న పొరబాటు జరిగినా ఇక "హరీ" అనవలసిందే) గడచి, మీ ఆదరాభిమానాలతో ఏ ఈడుకా ఈడు పాత్రలు ధరిస్తూ, ఈనాటికి మీ ముందు "ఓ సీత కథ"లో సీతగా కనబడి, మీ ఆశీస్సులు అందుకోబోతున్న ఈ తరుణంలో నా నట జీవితం మీద "ఓ సీత కథ" ప్రభావం గురించి మీతో నా అనుభూతులు, అనుభవాలు ముచ్చటించాలనుకుంటున్నాను.

సినీ నటజీవితంలో బాల తారలు చాలా తక్కువమంది పెద్దయ్యాక నటులుగా, నటీమణులుగా కనపడతారు. చార్లీచాప్లిన్‌తో "ది కిడ్" చిత్రంలో నటించి, మనల్నందర్నీ సమ్మోహితుల్ని చేసిన జాకీ కూగన్ వంటి బాలనటులే పెద్దయ్యాక నటజీవితంలో చిన్ననాటి ప్రమాణాలను అందుకోలేక పోయారని విన్నాను. దానికి కారణం అవకాశాలూ, పరిస్థితులూ కలసి రాకపోవడం అనుకుంటాను. మీ అందరి ఆశీస్సులవల్ల ఈ రంగంలో కృషి చేసే అవకాశాలు లభిస్తూనే వచ్చాయి.

“ఓ సీత కథ”లో సీత పాత్ర గురించి డైరెక్టర్ విశ్వనాధ్ గారు చెప్పినప్పుడు అంత స్కోప్ – వైవిధ్యం ఉన్న పాత్ర – క్లిష్టమైన పాత్ర లభించినందుకు నా మనస్సు వెర్రి ఆనందంతో ఉరకలూ, పరుగులూ వేసింది. అయితే పాత్ర లభించడం ఒక ఎత్తు, లభించిన పాత్రను పోషించగలగడం ఒక ఎత్తు. సినిమా తియ్యడం అన్నది ఒకరి మోనో యాక్షన్ కాదు. అదొక కంపోజిట్ ఆర్ట్. ఇందులో వివిధ దశలలో వివిధ వ్యక్తుల నిపుణతలు ఉపయోగపడతాయి. వీటన్నిటినీ సమన్వయపరచి, తాననుకున్న రీతిగా పాత్రలను వెండి తెర మీదికి మలచే దర్శకుని ప్రతిభ ఎంతటిదో “ఓ సీత కథ”లో నటిస్తున్నప్పుడు అర్థమైంది.

"స్త్రీ అబలకాదు. ప్రేమించినప్పుడు అమృతాన్నెలా పంచి ఇవ్వగలదో ఆగ్రహించినప్పుడు కరకంకాళి అయి, మనుష్యుల మనస్సుల్లోని దౌష్ట్యాన్ని మారణ హోమం చేయగలదు." అనే ఒక భావన చుట్టూ సీతనూ, మిగిలిన పాత్రలనూ ఊహించగలగడంలోనే విశ్వనాథ్ గారి ప్రతిభ వ్యక్తమౌతుంది.

విశ్వనాథ్ గారితో సెట్ మీద పనిచెయ్యడం ఒక మహత్తరమైన అనుభూతి. ఒక కళాతపస్వి తపస్సులో భాగం పంచుకుంటున్నామనే పవిత్రమైన భావనతో మనస్సు నిండుతుంది. ఆయనతో పనిచేసిన చాలామంది నటులు, నటీమణులు ఎందుకలా ఆయన్ని అభిమానిస్తారో "ఓ సీతకథ" షూటింగ్ జరుగుతున్నప్పుడు నాకర్థమైంది. సెట్ల మీద ఆయనలా నవ్వించగలగడం ఆయనకే చెల్లు. తాననుకున్న భావం కమ్యూనికేట్ అయిందనుకున్నప్పుడు ఆయన పొందే ఆనందం పసిపాప నవ్వులా, స్వచ్ఛంగా, సిగ్ధంగా, మనోహరంగా ఉంటుంది. నాకేకాదు, నా తోటి నటీనటులకు, టెక్నీషియన్ లకు అందరికీ విశ్వనాథ్ గారితో పనిచేయడం ఉత్సాహకరంగా ఉన్న ఆటలో పాల్గొంటున్నట్లుంటుంది.

ఆయన దర్శకత్వం వహించిన "కాలం మారింది, చెల్లెలి కాపురం" చిత్రాలకు వరుసగా రెండేళ్ళు 'బంగారు నందులు' లభించిన ఆనంద సమయంలో పాంగ్రోవ్ హోటల్లో జరిగిన సన్మాన సభలో జగ్గయ్యగారు "శ్రీ విశ్వనాథ్ నూటికి నూరుపాళ్ళు నటుడి దగ్గర్నుండి పర్ఫార్మెన్స్ పిండగల నేర్పరి" అన్నారు.

"ఓ సీత కథ" చూస్తే ఆయన అభిభాషణలో అతిశయోక్తి లేదని మీరే అంటారు.

"ఓ సీత కథ"లో సీత పాత్ర ఎంతో భావ సంఘర్షణకు లోనై తర్వాత అద్భుతమైన ట్రాన్సిషన్ తీసుకుని పెద్ద ముత్తయిదువుగా మారుతుంది. ఆ ట్రాన్సిషన్ చిత్రీకరణలో ఆయన చూపించిన నేర్పు అసమానం.

విశ్వనాథ్ గారు సెట్స్‌లోకొచ్చి, ఇన్‌స్పైర్ అయి పనిచేస్తారనిపించింది. ఉండబట్టలేక ఒకరోజు ఆయన్నే అడిగేశాను. "కొంతమంది డైరెక్టర్లు షాట్స్ డివిజన్ కూడా రాసుకుంటారు. మరి, మీరు చూస్తే డైలాగ్‌లు కూడా ఒక్కోసారి సెట్‌లో ఇంప్రూవైస్ చేస్తారు?" అని.

దానికాయన చెప్పిన సమాధానం ఏమిటంటే "పిచ్చిపిల్లా ప్రతిది సులభమ్ముగా సాధ్యపడదులెమ్ము.

ఏదీ అంత సులభంగా సాధ్యపడదు. మనిషి మనిషిలా బతకాలంటే బోల్డంత విచక్షణాజ్ఞానాన్ని ఉపయోగించాలి. ప్రతి డైరెక్టర్ మొత్తం చిత్రాన్ని తన మనోఫలకం పైన చిత్రించుకుంటారు. ఆ తర్వాత గైడెన్స్ కోసం ఊహల్లో చూసిన దాన్ని కాగితం మీద రికార్డ్ చేస్తారు. అయితే, సెట్స్‌లోకి వచ్చిన తర్వాత అక్కడి వీలునుబట్టి, ఆర్టిస్టుల అనుభవాన్ని బట్టి అక్కడికక్కడ కొన్ని మార్పులు చేసుకుంటాం. అనుభవం పెరిగిన కొద్దీ కాగితం మీద రాయనక్కర్లేకుండానే బ్రెయిన్‌లో రికార్డ్ అయిపోయి ఉంటుంది. ఆ బ్రెయిన్‌లో రాసుకున్న దాన్ని ఇంప్రూవ్‌మెట్స్‌తో సెల్యులాయిడ్ మీదికి ట్రాన్ స్లేట్ చెయ్యడం జరుగుతుంది. దానికి అపారమైన ఏకాగ్రత, సునిశితమైన అబ్సర్వేషన్ పవర్, అలసటలేని ఇమేజినేషన్ కావాలి" అంటూ నవ్వారు.

ఎంత బేలెన్స్డ్ మైండ్ ఆయనది. అందుకనే ఆయన చిత్రాలు అంత బేలెన్స్డ్ గా ఉంటాయి. నటీనటుల దగ్గర్నుండి అంత బేలెన్స్డ్ సబ్టిల్ పర్ఫార్మెన్స్ ఆయన రాబట్టగలుగుతున్నారనిపించింది.

'ఊర్వశి' శారదగారు "ఓ సీత కథ" చూసి, నా పాత్రపోషణ గురించి, ఇతర ఆర్టిస్టుల ప్రతిభావంతమైన నటన గురించి పత్రికా ముఖంగా అభినందించారు. అడుగడుగునా దర్శకుని ప్రతిభ కనబడున్నదని శ్లాఘించారు. ఆ మహానటి అభిమానాన్ని చూరగొనడానికి నా అద్రుష్టం, విశ్వనాధ్ గారి క్రుషి కారణాలని వేరే చెప్పక్కర్లేదు.

"శారద"లాంటి, "ఓ సీత కథ"లాంటి మరింకెన్నో, అంతకన్నా గొప్ప పాత్రలను ఆయన సృష్టించాలని, ఆయన దగ్గర పనిచేసే అదృష్టం మళ్ళీ మళ్ళీ కలగాలని కాంక్షిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ బంగారు నందుల్నే కాక రాష్ట్రపతి బంగారు పతకాలను కూడా అచిరకాలంలోనే అందుకోవాలని ఆకాంక్షిస్తూ –

**మీ 'సీత' కాబోతున్న, రోజారమణి.**

COMMENTS